ఎట్టకేలకు రాకపోకలు ప్రారంభం



గాంధీనగర్ ట్రస్టు కాలనీ ఆరంభం నుంచి ఎంపీడీఓ కాంప్లెక్స్ వరకు ఉన్న బీటీరోడ్డుపై రాకపోకలు

సాక్షి ఎఫెక్ట్..

జడ్చర్ల టౌన్: ఎట్టకేలకు పట్టణ పరిధిలో 167వ నంబర్ జాతీయరహదారిపై గాంధీనగర్ ట్రస్టు కాలనీ ప్రారంభం నుంచి ఎంపీడీఓ కాంప్లెక్స్ సముదాయం వరకు బీటీరోడ్డుపై వాహనాల రాకపోకలు గురువారం ప్రారంభం అయ్యాయి. దీంతో హమ్మయ్యా అంటూ పట్టణవాసులు, వాహనదారులు కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇక డిగ్రీకళాశాల వైపు రోడ్డుపై గురువారం సాయంత్రంతో బీటీ వేయడం పూర్తయ్యింది. ఆ రోడ్డుపైన రెండు రోజుల తరువాత రాకపోకలు ప్రారంభించనున్నారు. వాస్తవానికి 167వ నంబరు జాతీయ రహదారిపై సిగ్నల్‌గడ్డపై రోడ్డు విస్తరణ పనులు నెమ్మదిగా నడుస్తుండటంతో వాహనదారులు, పట్టణవాసులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. సామాజిక మాధ్యమాల్లో రోడ్డుపై చర్చను కొనసాగిస్తూ అధికార, విపక్షాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు సైతం చేసుకుంటూ వస్తున్నారు. ఈక్రమంలో గత 6 నెలలుగా ప్రస్తుతం రాకపోకలు ప్రారంభం అయిన రోడ్డు, బీటి పూర్తయిన రోడ్డుపై రాకపోకలు నిలిపివేశారు. దీంతో వ్యాపారులు, పట్టణవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరకు ఐదురోజుల క్రితం బీటీవేయటం ప్రారంభించిన విషయం తెలిసిందే. గాంధీనగర్ ట్రస్టు కాలనీ ఆరంభం నుంచి ఎంపీడీఓ కాంప్లెక్స్ సముదాయం వరకు మూడురోజుల క్రితమే బీటీ పనులు పూర్తయినప్పటికీ భారీ వాహనాలు వెళ్లే ఆస్కారం ఉండటంతో గురువారం నుంచి రాకపోకలకు అనుమతించారు. రోడ్డుకు అడ్డుగా ఉంచిన వాహనాలు, పైపులు, కంకర కుప్పలు తొలగించారు. డిగ్రీ కళాశాల మార్గంలోనూ బీటీ పనులు పూర్తయ్యాయి. అయితే రెండు రోజుల తరువాతే వాహనాల రాకపోకలకు అనుమతించనున్నారు.



డిగ్రీ కళాశాల హాస్టల్ ఎదురుగా రోడ్డుపై వేసిన బీటీ

దుకాణదారుల హర్షం

బీటి పూర్తయి రోడ్డుపై రాకపోకలు ప్రారంభం కావటంతో రోడ్డుపక్కన ఉన్న వ్యాపారులు హర్షంవ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ నేపథ్యంలో దుకాణాలు వెలవెలబోతున్నాయంటూ రెండు రోజుల క్రితం సాక్షిలో కథనం వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తమ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన సాక్షికి వ్యాపారులు ధన్యవాదాలు తెలిపారు. సమస్యను వెలుగులోకి తెచ్చినందునే రాకపోకలకు త్వరగా అవకాశం కల్పించారని చెబుతున్నారు. ఈ మేరకు నాలుగు నెలలుగా గిరాకులు లేక ఇబ్బందులు పడినవారు, దుకాణాలు మూసివేసినవారు మళ్లీ తమ వ్యాపారాలు కొనసాగించేందుకు సిద్ధమవుతున్నట్లు వివరించారు.

అసలు సమస్య ముందుంది

రోడ్డు విస్తరణలో అసలు సమస్యలు ముమ్ముందు ఎదుర్కోవాల్సి ఉంది. బీటీ వేసిన రోడ్డు కొంతభాగమే కావటం, రైల్వేలైన్‌పై నేటికి బ్రిడ్జ్ నిర్మాణం కాకపోవటంతో ట్రాఫిక్ సమస్యను మరింతకాలం ఎదుర్కోక తప్పదు. బాదేపల్లి హైస్కూల్ నుంచి డిగ్రీ కళాశాల గేట్ వరకు ఇంకా రోడ్డు విస్తరణ పనులు ఆరంభం కాలేదు. ఈ ప్రాంతంలో ఆర్‌యూబీల నిర్మాణం, మెయింటెనెన్స్ వాల్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే తప్ప రోడ్డు పనులు ప్రారంభించేందుకు ఆస్కారం లేదు. వీటితోపాటు బీటీ పూర్తయిన మార్గంలో రెండోవైపు రోడ్డు పనులు సైతం చేపట్టాల్సి ఉంది. జూన్ నెల ఆరంభం కానుండటంతో వర్షాల బెడద వెంటాడుతుంది. దీంతో రోడ్డు సమస్య మరింత కాలం ఎదుర్కోక తప్పదని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు ఆధ్వర్యంలో వేసవి తైక్వాండో శిక్షణా శిబిరం ఉత్సాహంగా జరుగుతోంది. ఈసందర్భంగా సురేందర్‌బాబు మాట్లాడుతూ ఏటా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో నాన్‌చాక్, కర్రసాము, సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వచ్చేనెల 5వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు.

పారిశుద్ధ్యం పనులు పూర్తికావచ్చాయి

నవాబుపేట: పారిశుద్ధ్యం, తాగునీటి ఏర్పాట్ల పనులు పాఠశాలల్లో పూర్తికావచ్చాయని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మండలంలో వివిధ పాఠశాలల పనులపై ఆరాతీసి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మఅదర్శ పాఠశాలల కార్యక్రమంలో భాగంగా మండలంలో మొదటగా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర పనులు చేపట్టాల్సిన పాఠశాలలో వీటిని ప్రధానంగా తీసుకుని పూర్తి చేసినట్లు వివరించారు. కాగా కొత్తగా నిర్మిస్తున్న అదనపు గదులు, ప్రహరీ తదితర పనులు సాగుతున్నాయని.. త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈఓపీఆర్‌డీ బద్రునాయక్ తదితరులు ఉన్నారు.

కళాతోరణం, చార్మినార్ ఉండాల్సిందే

జడ్చర్ల టౌన్: తెలంగాణ రాజముద్రలో కాకతీయ కళాతోరణం, చార్మినార్‌లు తొలగించరాదని.. తెలంగాణ మైనార్టీ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ హఫీజ్ ఉర్ రెహమాన్ గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కళాతోరణం గొప్ప చరిత్ర కలిగిన చిహ్నమని, తెలంగాణ ప్రాంతాన్ని పాలించిన కాకతీయులు ఈ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటు నందించారని పేర్కొన్నారు. 200ఏళ్లు పాలించిన కాకతీయులు నిర్మించిన గొలుసుకట్టు చెరువులు, చారిత్రక కట్టడాలు, దేవాలయాల ఘన చరిత్ర పాలన వైభవం అంతా కళాతోరణంలో పూజగుచ్చినట్లుగా ఉందన్నారు. అదేవిధంగా హైదరాబాద్ అనగానే గుర్తుకు వచ్చే చార్మినార్ సైతం అందరికీ సుపరిచతమైనందున రాజముద్రలో కొనసాగించాలన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలి

మహబూబ్‌నగర్ రూరల్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో మహిళలు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ కరుణశ్రీ, ఎంపీఓ నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రామచంద్రాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాలపై ఉన్న నమ్మకంతో మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతలు అప్పగించిందన్నారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్ స్వాధీనం

రాజాపూర్: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ టిప్పర్‌తో పాటు మరో ట్రాక్టర్‌ను రాజాపూర్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. రాయపల్లిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా టిప్పర్ ఎదురుగా రావడంతో ఆపి విచారించగా ఎలాంటి పత్రాలు లేవని తేలిందన్నారు. కాగా డ్రైవర్‌ను విచారిస్తే ఖానాపూర్‌నకి చెందిన బొజ్జలింగయ్య టిప్పర్‌గా గుర్తించి కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. అదేవిధంగా ట్రాక్టర్ ఇబ్రహీంపల్లిలో పట్టుపడినట్లు వివరించారు. ట్రాక్టర్, టిప్పర్లను స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

నారాయణపేట రూరల్: పట్టణంలోని 3వ వార్డు పరిధిలో శ్రీ నగర్‌కాలనీలో గత కొంత కాలంగా తీవ్రంగా తాగునీటి ఎద్దడి నెలకొంది. దీనిపై మాజీ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ దృష్టిసారించి, సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రం ఇచ్చిన వెంటనే కమిషనర్ సునీత కాలనీకి వెళ్లి మున్సిపల్ ఇంజినీర్, ఇతర సిబ్బందితో కలిసి పరిష్కారానికి మార్గం సిద్ధం చేయించారు. ఈ మేరకు గురువారం పైప్‌లైన్ పనులు చేయించి తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టారు. దీంతో కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రగడ



ఇన్‌చార్జీ సబ్‌రిజిస్ట్రార్ భాగ్యలక్ష్మితో మాట్లాడుతున్న బాధితులు

రిజిస్ట్రేషన్‌లు ఆపారంటూ ఆందోళన

జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ఓ డీటీసీపీ వెంచర్‌కు సంబంధించిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయడం లేదంటూ.. వెంచర్ నిర్వాహకులు స్థానిక ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ భాగ్యలక్ష్మిని నిలదీసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు...జడ్చర్ల శివారులోని సర్వే నంబర్ 220/1లో 1.38 ఎకరాల విస్తీర్ణంలో డీటీసీపీ అనుమతులు తీసుకుని వెంచర్‌ను ఏర్పాటు చేశారు. నిబంధనల మేరకు స్థానిక మున్సిపల్ కమిషనర్ రాజయ్య ఫైనల్ లేఅవుట్ అనుమతులు మంజూరు చేసి మార్ట్‌గేజ్ ప్లాట్లను విడుదల చేశారు. దీంతో ఆయా ప్లాట్లను కొనుగోలు చేసిన వారికి గురువారం రిజిస్ట్రేషన్ చేసేందుకు డాక్యుమెంట్‌లను రిజిస్ట్రార్ కార్యాలయంలో దాఖలు చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీకి చెందిన జావీద్ వెంచర్ రోడ్డుకు గాను ప్రభుత్వ భూమికి సంబంధించి వివాదం ఉందని రిజిస్ట్రేషన్‌లను నిలిపివేయాలని ఫిర్యాదు చేశారు. దీంతో సబ్‌రిజిస్ట్రార్ ఫిర్యాదు దారుడికి సమాచారం ఇచ్చి ఇందుకు సంబంధించి ఆధారాలను తమకు సమర్పించాలని కోరారు. కాగా వెంచర్ నిర్వాహకులకు సంబంధించి మాజీ సర్పంచ్ ప్రణీల్‌చందర్, స్థానిక వార్డు కౌన్సిలర్ నందకిషోర్‌గౌడ్, తదితరులు సబ్‌రిజిస్ట్రార్ భాగ్యలక్ష్మితో వాదనకు దిగారు. తమప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేయడానికి కాంగ్రెస్ నాయకుల అనుమతి కోరడం ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని అనుమతులు ఉన్నా రిజిస్ట్రేషన్‌లను ఆపడంపై నిలదీశారు. కోర్టు ఆదేశాలు ఉంటే తప్ప నిలిపి వేయడం కుదరదని, కేవలం ఓ వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా ఫిర్యాదు చేస్తే చర్యలు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి వాస్తవాలు ధ్రువీకరించుకుని రిజిస్ట్రేషన్‌లు చేస్తామని ఆమె బదులిచ్చారు. తాము రిజిస్ట్రేషన్‌లను ఆపలేదని ఫిర్యాదు చేసిన వారి నుంచి అభ్యంతరాల ధ్రువీకరణ పత్రాలు కోరామన్నారు. కాగా స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడికి తలొగ్గి రిజిస్ట్రేషన్‌లను పెండింగ్‌లో పెట్టారని ప్రణీల్‌చందర్ ఆరోపించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

హరితహారానికి సన్నద్ధం కావాలి



గాధిర్యాల్‌లో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

మహమ్మదాబాద్: హరితహారంలో భాగంగా మొక్కలు నాటడానికి సన్నద్ధం కావాలని డీఎల్‌పీఓ పండరీనాథ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గాధిర్యాల్‌లో నర్సరీని పరిశీలించారు. మొక్కల పెంపకంపై వివరాలు సేకరించారు. కాగా పంచాయతీ కార్యదర్శి హాజీ, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డి పలు వివరాలు ఆయనకు తెలిపారు. జూన్‌లో వర్షాలు పడనుండడంతో ఇప్పటి నుంచే పనులు ప్రారంభించుకోవాలని అన్నారు. గుంతలు తవ్వడం ప్రారంభించాలని ఆయన వారికి సూచించారు.

‘అమరుల కంటే గొప్పవారు కాలేరు’

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ రాజముద్రలో రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల జ్ఞాపకాల స్థూపానికి సింహభాగం కల్పించడం కోసం... ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సబబుగానే ఉందని, అమరుల కంటే ఎవ్వరూ గొప్పవారు కాలేరని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర విముక్తి కోసం మట్టి మనుషులు చేసిన పోరాటానికి అది ప్రతీక అని పేర్కొన్నారు. మలిదశ ఉద్యమానికి ప్రాణవాయువుగా నిలిచిన గీతం జయహే తెలంగాణ కీరవాణి సంగీత సారథ్యంలో రికార్డు చేయడాన్ని కొంతమంది స్వార్థపరులు విమర్శిస్తున్నారని, గతంలో ఇదే గీతాన్ని ఆంధ్ర గాయకుడు రామకృష్ణతో, అదే విధంగా బతుకమ్మ పాటను ఏఆర్ రహమాన్ రికార్డు చేయించడం ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకోవాలని కోరారు. గీత రచయిత, సహజ కవి అందెశ్రీకి తాము పూర్తిస్థాయిలో మద్దతుగా నిలుస్తామని, ప్రభుత్వం ఆయనకు సముచితస్థానం కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు.

నృత్యాలతో ఆకట్టుకున్న చిన్నారులు



అవార్డులు పొందిన చిన్నారులతో పట్టణ ప్రముఖులు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక దూమ్ డాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం నృత్యకళా అవార్డుల వేడుకలు ఉత్సాహంగా సాగాయి. సోలో, డ్యూయల్, గ్రూపు విభాగాల్లో చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు, యువత ప్రదర్శించిన సోలో, వెస్ట్రన్, క్లాసికల్ డాన్స్ ఎంతగానో అలరించాయి. అనంతరం దాదాపు 200 మంది చిన్నారులు, యువతతోపాటు డాన్స్‌మాస్టర్లకు దూమ్ డాన్స్ స్టూడియో డైరెక్టర్ ఎ.అజీమ్ ఆధ్వర్యంలో అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో బెక్కం జనార్దన్, శ్రీదేవి, క్రాంతికుమార్, రాజేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ, రేణుక, పద్మయాదవ్‌తోపాటు డాన్స్ మాస్టర్లు మేఘన, మౌనిక, ఉమారెడ్డి, అన్వర్, ఆనంద్, యశ్వంత్, నవీన్, రాజు, యాదవ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

కూలీల హాజరు శాతం పెంచాలి

బాలానగర్: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఈజీఎస్ పనులపై ప్రత్యేక అధికారి బాబురావ్ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టిన పనులపై ఆరా తీసిన ఆయన సెగ్రిగేషన్ షెడ్ల నిర్వాహణ పకడ్బందీగా సాగాలని.. అందుకు చేపట్టాల్సిన చర్యలపై కార్యదర్శులతో మాట్లాడారు. షెడ్ల నిర్మాణం పూర్తయి ఏళ్లు గడిచినా వినియోగంలోకి తీసుకురాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆదర్శ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీఓ శరత్ చంద్రబాబు, ఎంపీఓ విజయకుమారి, ఏపీఓ రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు అవసరం



రాజాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు



జానంపేటలో మాట్లాడుతున్న ఏడీఏ యశ్వంత్‌రావు



అప్పంపల్లిలో..

అడ్డాకుల: వర్షాకాలం పంటల సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో పంటలు సాగు చేసే రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని దేవరకద్ర ఏడీఏ యశ్వంత్‌రావు అన్నారు. మూసాపేట మండలం జానంపేట రైతు వేదికలో గురువారం జరిగిన రైతుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గుర్తింపు పొందిన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. రసీదు పొంది పంటకాలం పూర్తయ్యే వరకు దాన్ని భద్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కాగా సదస్సుకు కేవలం 12 మంది రైతులే హాజరయ్యారు. దీంతో మొక్కుబడిగా సాగింది. ఎంఏఓ రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా రైతు వేదిక గ్రామానికి దూరంగా ఉండటంతో రైతులు తక్కువ సంఖ్యలో వచ్చారని తెలిపారు. కాగా సదస్సు గురించి గ్రామంలో సరైన ప్రచారం కల్పించకపోవడంతో రైతులు రాలేదని తెలుస్తోంది. కార్యక్రమంలో ఏఈఓ శివలీల తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: గ్రామాల్లో విక్రయించే లూజ్ విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దని మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్ పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంతో పాటు, కల్లేపల్లి, ఈద్గాన్‌పల్లి, కుత్నేపల్లి తదితరల గ్రామాల్లో విత్తన కొనుగోలుపై అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట విత్తనాలు(జీలుగ) రాజాపూర్‌లోని రైతు ఆగ్రోసేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని.. అవసరమున్న రైతులు తీసుకోవాలన్నారు. ఏఈఓలు శ్రీనివాస్, అంజనేయులు, మేఘనధ్, దీపికగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్న విత్తనాల కొనుగోలు విషయంలో జాగ్రత్తలు, పంటల సాగుపై గురువారం అప్పంపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ శ్రీజ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మిడ్జిల్: మండలంలో జాతీయ ఉపాధి హామీలో భాగంగా 2023–2024 సంవత్సరంలో చేసిన పనులపై వారం రోజులుగా అన్ని గ్రామాల్లో సోషల్ అడిట్ బృందం పర్యటించి వివరాలు సేకరించింది. ఈ మేరకు గురువారం మండలం కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ సమావేశంలో గ్రామాల వారీగా నివేదికలు చదివారు. మండల కేంద్రంతో పాటుగా కొత్తపల్లి తదితర గ్రామాల్లో పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నట్లు వివరించారు. పూర్తి సమాచారం త్వరలో ఇస్తామని ఎంపీడీఓ గీతాంజలి తెలిపారు. సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీఓ ఇషాబేగం, ఏపీడీ శ్రీపాల్, శృతి, బద్రునాయక్ పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయానికి దారి నిర్మాణం



రోడ్డు నిర్మాణం కోసం చదును చేస్తున్న కూలీలు

గండేడ్: వెన్నాచేడ్‌లో పోచమ్మ ఆలయానికి దారి నిర్మాణం చేసేందుకు గురువారం శ్రీకారం చుట్టారు. ఇదివరకు ఆలయానికి వెళ్లాలంటే నానా పాట్లు పడాల్సి వచ్చేది. ఏళ్ల తరబడి పంటపొలాల గెరుసుల మీదుగా నడిచి వెళ్లేవారు. బోనాల పండుగ వర్షం కాలం ప్రారంభం అయ్యాక రావడంతో ప్రతిసారి మహిళలు బోనాలు ఎత్తుకుని బురదలో నడిచి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామస్తులంతా సమావేశం నిర్వహించి దారి నిర్మాణానికి సంకల్పించారు. ఆపొలాల రైతులను ఒప్పించి గుడి దగ్గరకు వెళ్లేలా తీర్మానించారు. ఇందులో భాగంగానే గురువారం కూలీలతో చదును చేయించి మట్టి తీసుకుచ్చి పోయించారు. తాత్కాలికంగా వేసిన రోడ్డును తరువాత పటిష్టం చేస్తామని స్థానికులు తెలిపారు. రోడ్డు నిర్మాణంలో మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, సత్యసాయి సమితి ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివమల్లప్ప, కన్వీనర్ నారాయణరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

లలితాంబికా ఆలయంలో సామూహిక పూజలు



సామూహిక పూజలో పాల్గొన్న భక్తులు

జడ్చర్ల టౌన్: మండలంలోని 44వ నంబరు జాతీయరహదారిపై గొల్లపల్లి వద్ద ఉన్న లలితాంబికా ఆలయంలో ఉచితంగా సరస్వతి దేవి సామూహిక పూజలు నిర్వహిస్తున్నట్లు తపోవన అభివృద్ధి కమిటీ సభ్యులు తెలియజేశారు. గురువారం ప్రారంభమైన పూజలు జూన్ 3 వరకు కొనసాగుతాయని వెల్లడించారు. ప్రతిరోజు ఉదయం 10.30గంటలకు పూజలు ప్రారంభం కానున్నట్లు వివరించారు. పూజలో ఉంచిన నోటుపుస్తకాలను ఉచితంగానే అందజేస్తున్నామని, మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తున్నట్లు సభ్యులు తెలియజేశారు. సరస్వతి దేవి ఆశీస్సులకోసం తమ పిల్లలను తీసుకుని వచ్చి పూజలో పాల్గొనాలని తల్లిదండ్రులకు సూచించారు. పూజలో పాల్గొన దలచిన వారు 9177085641 నంబరుకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం



గ్రామస్తులు సామూహికంగా కమాన్‌ను ప్రారంభిస్తున్న గ్రామస్తులు



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మహమ్మదాబాద్: వీరాంజనేయస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని గాధిర్యాల్‌లో గురువారం ఉదయం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామానికి వచ్చే రోడ్డులో గేటు వద్ద కీ.శే. భృంగి సత్యయ్య స్మారకార్థం నిర్మించిన కమాన్‌ను గ్రామస్తులంతా కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. పూజారి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ వెంకట్రాం రెడ్డి దంపతులు కల్యాణ వేడుక నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పుట్టపహాడ్, చౌదర్‌పల్లి, మంగంపేట్, రుసుంపల్లి గ్రామాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.


దినచర్యలో యోగా భాగమవ్వాలి



యోగాశిక్షణా శిబిరంలో పాల్గొన్న సీఐ అప్పయ్య తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మానసిక ఒత్తిడిని జయించాలంటే యోగా ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులు ఇప్పటి నుంచే దినచర్యలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలని వన్‌టౌన్ సీఐ ఎం.అప్పయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణ శిబిరంలో గురువారం యోగా శిక్షణ నిర్వహించగా.. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రతి రోజు కనీసం 10 నిమిషాలు యోగా చేయాలని సూచించారు. జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.బాల్‌రాజు మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ చెన్నవీరయ్య, ప్యాట్రన్ లక్ష్మణ్, డాక్టర్ మీర్ ముజమిర్ అలీ, డాక్టర్ మీర్ సికందర్‌అలీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోరాటమే సీఐటీయూ నినాదం



కావేరమ్మపేట కార్యాలయంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం


జడ్చర్ల టౌన్: ప్రజావ్యతిరేక అంశాలపై పోరాటమే నినాదంగా సీఐటీయూను ప్రారంభించారని రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్ అన్నారు. గురువారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని మున్సిపాలిటీలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆవిర్భావం నుంచి కార్మికుల పక్షాన ప్రజా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ నేటికి పోరాడుతుందన్నారు. నేటి వరకు దేశవ్యాప్తంగా జరిగిన 22 సభల్లో సీఐటీయూ కీలక పాత్ర పోషించిందన్నారు. కార్మిక, కర్షక, రైతు సమస్యలపై పోరాటంతో ముందుంటుందన్నారు. రాబోయే రోజుల్లో చట్టాలు కార్మికులకు నష్టం చేసే విధంగా ఉన్నాయని వాటిపై ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే పీఆర్‌సీలో కార్మికుల కనీస వేతనం రూ.26వేలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేడుకల్లో భాగంగా బాదేపల్లి, కావేరమ్మపేట మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికులు కేశవులు, జంగయ్యలు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, పట్టణ కమిటి ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ, కోశాధికారి విజయ్‌కుమార్, నర్సింహులు, అలివేలు, యాదమ్మ, భీమమ్మ, సహదేవ్, మొగులమ్మ, స్వరూప, అంజమ్మ, దేవమ్మలు పాల్గొన్నారు.

బస్సు దిగిన ఐదు నిమిషాల్లోనే..

● గుండెపోటుతో వ్యక్తి మృతి

గండేడ్: బస్సు దిగిన వ్యకి ఐదు నిమిషాల్లో గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలపరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. బలబద్రాయపల్లి తండాకు చెందిన రుక్యానాయక్(52) కోస్గిలో నివాసం ఉంటున్నాడు. బుధవారం స్వల్ప అస్వస్థతకు గురవ్వడంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి బయలుదేరాడు. ఈ క్రమంలో కాగా చెన్నాయిపల్లి తండాకు చెందిన తన బావమరిది మోహన్‌నాయక్‌ని వెంట తీసుకుని వెళ్లడానికి గండేడ్ వచ్చాడు. ఈ క్రమంలో దిగిన ఐదు నిమిషాల్లోనే గుండెపోటుతో కుప్పకూలి అక్కడే మృతిచెందాడు. కాగా మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం స్వంత తండాకు తరలించారు.

ఇంత నిర్లక్ష్యమా..?



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని ఆదర్శ రిసోర్స్ సెంటర్ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న భారీ వృక్షం కిందపడితే ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. ఈనెల 24న సాయంత్రం గాలి వానకు ఘటన చోటు చేసుకుంది. వారం రోజులవుతున్నా ఇప్పటి వరకు దాన్ని అక్కడి నుంచి తొలగించే ప్రయత్నం చేయడం లేదు.